క్లుప్తంగా

నేడు కోట్‌పల్లి మండల సభ

బంట్వారం: కోట్‌పల్లి మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉ.11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కోట్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

ఈవీఎంల పరిశీలన



ఈవీఎంలను పరిశీలిస్తున్న ఐఎఎస్ ఆకాశ్

తాండూరు రూరల్: పట్టణంలోని సెయింట్ మార్క్స్ స్కూల్లో గురువారం ఈవీఎంలను సాధారణ పరిశీలకులు, ఐఎఎస్ ఆకాశ్, ఆర్డీఓ శ్రీనివాస్‌రావుతో కలిసి పరిశీలించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తరుపున ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంల కమిషనింగ్‌పరిశీలన ప్రారంభించినట్లు తెలిపారు.

ఇంటి నుంచి ఓటింగ్



ఇంటి నుంచి ఓటు వేస్తున్న వృద్ధుడు

తాండూరు రూరల్: ఎన్నికల కమిషన్ వృద్ధులు, వికలాంగులకు ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకునే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా గురువారం పట్టణంలోని భవానినగర్‌లో ఓ వృద్ధుడు ఇంటి నుంచి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ప్రక్రియను ఆర్డీఓ శ్రీనివాస్‌రావు దగ్గరుండి పరిశీలించారు.

మార్షల్ ఆర్ట్స్‌లో అవార్డు



అవార్డు అందుకుంటున్న రమేష్

కొడంగల్ : మండల పరిధిలోని ఖాజా అహ్మద్ పల్లి గ్రామానికి చెందిన రమేష్ మార్షల్ ఆర్ట్స్‌లో అవార్డు అందుకున్నారు. సింగిడి కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేశారని గురువారం ఒక ప్రకటనలో ఆర్గనైజేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర భాష, సాంస్కృతిక విభాగం సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగినట్లు తెలిపారు. పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి సింగిడి అవార్డులు ఇచ్చినట్లు చెప్పారు.

కొనసాగుతున్న రుద్రాభిషేకాలు



రుద్రాభిషేకం చేపడుతున్న భక్తులు

అనంతగిరి: పట్టణంలో కార్తీక మాసం పురస్కరించుకొని ఆధ్యాత్మిక సేవా మండలి ఆధ్వర్యంలో శివునికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి పాటలు అలపించారు. అనంతరం ప్రత్యేక హారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

కుల్కచర్ల: ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కుల్కచర్ల కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారి దేవి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీలో ఆర్బీఎస్‌కే వైద్య బృందం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. శుభ్రతను పాటించడంతో పాటుగా ఆరోగ్యకరమైన అలవాట్లు, ఆహారం వంటి అంశాలలో తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యోగా ఆసనాలు చేయడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో అందరికీ సంక్షేమ పథకాలు

- అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం
- నన్ను గెలిపించి అసెంబ్లీకి పంపించండి
- కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డి



తాండూరు: జమాతే ఇస్లామి హింద్ ప్రతినిధులతో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

తాండూరు: తాండూరు ఎమ్మెల్యేగా తనను గెలిపించి అసెంబ్లీకి పంపించాలని కాంగ్రెస్ పార్టీ తాండూరు అసెంబ్లీ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో జమాతే ఇస్లామి హింద్ అసోసియేషన్ ప్రతినిధులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముస్లింలు పెద్దఎత్తున చేరుకొని కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే విజయం సాధించిన వెంటనే తమ డి మాండ్‌లను నెరవేర్చాలని మెమోరాండం సమర్పించారు. అందుకు మనోహర్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ తాను ఎమ్మెల్యే అయినా వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తానన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, అసోయేషన్ ప్రతినిధి సయ్యద్ ముబ్బషీర్, పట్టణ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, అబ్దుల్ రవూఫ్, మసూద్ తదితరులున్నారు.

నిరుపేదలకు అండగా కాంగ్రెస్ పార్టీ

కుల్కచర్ల: నిరుపేదలకు అండగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజనేయులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో గోరిగడ్డతండాకు చెందిన ఉప సర్పంచ్ గోపాల్ నాయక్‌తో పాటుగా తండావాసులు కాంగ్రెస్‌లో భారీగా చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బహుజన ప్రజలకు ముఖ్యంగా గిరిజన ప్రజల అభ్యున్నతికి కృషి చేసేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని తెలిపారు. కార్యక్రమంలో కుమ్మరి స్వామి, రాంచందర్ నాయక్, కృష్ణయ్య, పవన్‌కుమార్, హర్యానాయక్, రాహుల్, పి.గోపాల్ నాయక్, వినోద్, సోమలింగం, వెంకటేశ్, బిచ్చయ్య, అంబాదాస్ పాల్గొన్నారు.

కొడంగల్‌లో భారీ ఊరేగింపు

కొడంగల్: కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ఊరేగింపుగా ప్రచారం నిర్వహించారు. కొడంగల్, కొండారెడ్డిపల్లి, గుండ్లకుంట, బూల్కాపూర్, పాత కొడంగల్, ఐనన్‌పల్లి గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. చేతి గుర్తుకు ఓటు వేసి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, నందారం ప్రశాంత్, కృష్ణంరాజు, దాము, నయీమ్, మురహరి వశిష్ట, అనితారెడ్డి, రాము, భీంరాజ్‌లతో పాటు యూత్ కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

నియోజకవర్గంలో ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి, రేవంత్ సోదరుడు కృష్ణారెడ్డి గ్రామాల్లో పర్యటించి రేవంత్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు.

కాంగ్రెస్‌లో చేరికలు

బొంరాస్‌పేట: మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నేత తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డి పల్లిలో గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ వార్డు సభ్యుడు రాములు, మాజీ వార్డు సభ్యులు వెంకటయ్య, వెంకటమ్మ, మాజీ కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, రాజేశ్‌రెడ్డి చేరారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం

మర్పల్లి: మండలంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తామని ఆ పార్టీ బ్లాక్- 2 అధ్యక్షుడు మల్కనెల్లి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జీ సుభాష్‌యాదవ్, మైనార్టీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఖలీమోద్దీన్‌లతో కలిసి ఆయన ఇంటింటి ఎన్నికల ప్రచారం చేశారు. రాష్ట్రం ఏర్పడక ముందు మర్పల్లి మండలం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను గెలిపించేందుకు పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరు చేతి గుర్తుకే ఓట్లు చేసి మండలంలో 5 వేల మెజార్టీ తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంజీవరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గోపాల్ జిల్లా మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు ఖలీమోద్దీన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నారాయన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వీర్లపల్లిలో..

మండలంలోని వీర్లపల్లిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం మాజీ ఎంపీపీ నారాయణరెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ అనంత్‌రెడ్డి, కోట్‌మర్పల్లి ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చేతి గుర్తుకే ఓటు వేసి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, వీర్లపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకట్, సుక్కారెడ్డి, సత్యనారాయన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, ఈడ్గీ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



తండావాసులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నేతలు



కొడంగల్: కాంగ్రెస్‌లో చేరుతున్న గిరిజన నాయకులు



బొంరాస్‌పేట: పార్టీలో చేరిన నాగిరెడ్డిపల్లి వాసులు



మర్పల్లి: ప్రచారం నిర్వహిస్తున్న కృష్ణారెడ్డి, సుభాష్‌యాదవ్

బొట్టు నీకు.. ఓటు మాకు



బొట్టు పెడుతూ ఓటు అభ్యర్థిస్తున్న ప్రతిమారెడ్డి

కుల్కచర్ల: ఎన్నికల ప్రచారంలో భాగంగా పరిగి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొప్పుల మహేశ్ రెడ్డి సతీమణి కొప్పుల ప్రతిమారెడ్డి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఇంటింటికి వెళ్లి మహిళలకు బొట్టు పెడుతూ కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు.

అంకాలజీలో సుశాంత్ సత్తా

తాండూరు: తాండూరు పట్టణానికి చెందిన వైద్య విద్యార్థి బొజు సుశాంత్ సర్జికల్ అంకాలజీలో సీటు సాధించి జిల్లాలో తొలి వైద్య విద్యార్థిగా గుర్తింపు పొందారు. తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునీతాసంపత్ దంపతుల రెండవ కుమారుడు ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ఉన్నత వైద్య విద్య అభ్యసించేందుకు సర్జికల్ అంకాలజీలో తొలిసారి సూపర్ స్పెషాలిటీ సీటును బెంగళూరులోని రామ య్య మెడికల్ కళాశాలలో సీటు దక్కించుకున్నారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునీ తాసంపత్‌కుమార్ దంపతులకు ముగ్గురు సంతానంలో అందరు డాక్టర్‌లు కావడం విశేషం. తండ్రి డాక్టర్ సంపత్‌కుమార్‌ను ఆదర్శం చేసుకొని వైద్య విద్యతో సత్తా చాటుతున్నారు.

నా తమ్ముడిని భార్యే చంపేసింది



ఆనందం మృతదేహం

ధారూరు: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం మండల పరిధిలోని కేరెల్లి గ్రామంంలో చేటు చేసుకుంది. ఈ ఘటనపై మృతుడి అక్క నాగమణి పోలీసులను ఆశ్రయించింది. తన తమ్ముడిని భార్య, ఆమె బంధువులు కలిసి చంపేశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు.. కేరెల్లి గ్రామానికి చెందిన బుడ్డల ఆనందం (36) 10 రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉంటున్న భార్య వద్దకు వెళ్లాడు. కాపురం విషయంలో భార్యాభర్తలు గొడవ పడ్డారు. గురువారం స్వగ్రామానికి వచ్చిన ఆనందం గ్రామ సమీప గాలిపోశమ్మ గుడి వద్ద రోడ్డు పక్కన అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అతడి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జోరుగా ఇంటింటి ప్రచారం



యాలాల: రోహిత్‌రెడ్డికి మద్దతుగా అక్కంపల్లిలో ప్రచారం చేస్తున్న సంధ్యారాణి

యాలాల: మండల పరిధిలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మండలంలోని జుంటుపల్లి, అక్కంపల్లి, జక్కేపల్లి, ముద్దాయిపేట, కోకట్ తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ తరపున ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి మద్దతుగా యాలాల జెడ్పీటీసీ సిద్రాల సంధ్యారాణి అక్కంపల్లిలో ఇంటింటి ప్రచారం చేశారు. అధికార పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, రోహిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జక్కేపల్లి గ్రామంలో కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు కోర్వని అమృతప్ప ఆధ్వర్యంలో భారీగా కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ స్కీంలను వివరిస్తూ మనోహర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.



యాలాల: జక్కేపల్లిలో మనోహర్‌రెడ్డికి ఓటేయాలని కోరుతున్న అమృతప్ప

దిర్సంపల్లి.. నేతలపై లొల్లి

- మండల కేంద్రంగా ప్రతిపాదించక పోవడంపై గ్రామస్తుల ధర్నా
- ఎమ్మెల్యే, జెడ్పీటీసీల తీరుపై రోడ్డెక్కిన ప్రజలు



రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న స్థానికులు

దోమ : దిర్సంపల్లిని ప్రజాప్రతినిధులు చిన్నచూపు చూస్తున్నారని ఆ గ్రామ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల పరిధిలోని దిర్సంపల్లిలో పార్టీలకు అతీతంగా రంగారెడ్డిపల్లి, పరిగి ప్రధాన రోడ్డుపై బైటాయించి గ్రామస్తులు ధర్నా చేశారు. స్థానిక ఎమ్మెల్యే, మండల జెడ్పీటీసీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. బుధవారం పరిగి పట్టణంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్‌ను స్థానిక ఎమ్మెల్యే కొప్పుల మహేశ్వర్‌రెడ్డి దాదాపూర్‌ను మండల కేంద్రంగా ప్రకటించాలని కొరవడంతో వారు ఆక్రోశానికి గురయ్యారు. దిర్సంపల్లికి అన్ని వసతులకు అనుకూలంగా ఉన్నప్పటికీ మండల కేంద్రంగా ఎందుకు ప్రతిపాదించారని నిలదీశారు. ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సీఎం కేసీఆర్ వద్ద ఎందుకు ప్రస్తావన చేయలేదని వారు మండిపడుతున్నారు. తమపై కావాలనే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో దిర్సంపల్లికి రైతు వేదిక, వరి గోదాములు, మాడల్ స్కూల్ వస్తే రానివ్వకుండా అడ్డుకొని ఇతర గ్రామాలకు తరలించారని ఆరోపించారు. ఎమ్మెల్యే, జెడ్పీటీసీకి మా ఊరి ప్రజలు ఏమైనా అన్యాయం చేశారా అంటూ ప్రశ్నించారు. దిర్సంపల్లిని మండల కేంద్రంగా ప్రకటించకపోతే పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యే, జెడ్పీటీసీని గ్రామంలోకి రానివ్వబోమని హెచ్చరించారు.

క్వారీతో వ్యవసాయం, బోర్లు నాశనం?

జెడ్పీటీసీ నాగిరెడ్డికి సంబంధించిన క్వారీతో తమ బోర్లు, వ్యవసాయంతో పాటు దుమ్ము ధూళితో తమ ఆరోగ్యాలు పాడవుతున్నాయని, అయినా చూసీచూడనట్లు ఉంటున్నామని వారు పేర్కొన్నారు. దాదాపూర్‌ను మండల కేంద్రంగా ప్రతిపాదించాలని ఎమ్మెల్యే చెప్పడం ఎంతవరకు సమంజసమని అసహనం వ్యక్తం చేశారు. క్వారీతో ఆరోగ్యాలు పాడుతున్నా, పంటలు నాశనం అవుతున్నా, బోర్లు పాడైపోతున్నా తాము ఇప్పటివరకు ఏ అధికారికి ఫిర్యాదులు చేయలేదని వాపోయారు.మండలానికి చెందిన జెడ్పీటీసీ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తున్నారని మిన్నకుండిపోయామన్నారు. దిర్సంపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు ప్రకటించే వరకు పోరాటం ఆగదని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నేతలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీలో పలువురి చేరిక



యాలాల: రోహిత్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తున్న వీరశైవ లింగాయత్‌లు

యాలాల: బీఆర్‌ఎస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరికలు పెరుగుతున్నాయని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన పలువురు మహిళలు, యువకులు రోహిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేనంతగా తాండూరులో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ. కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు లాంటి కార్యక్రమాలతో గ్రామాల్లో వసతుల కల్పన చేపట్టినట్లు వివరించారు.

వీరశైవ లింగాయత్‌ల మద్దతు

మండలంలోని ముద్దాయిపేట వీరశైవ లింగాయత్‌లు బీఆర్‌ఎస్ పార్టీకి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి పూర్తి మద్దతు ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో తమ సమాజం రోహిత్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, సర్పంచ్ కృష్ణయ్యగౌడ్, నాయకులు ఆసిఫ్ హుస్సేన్, పంతుల రాజప్ప, ఈశ్వరయ్య, శ్రీశైలం, సిద్రామేశ్వర్ తదితరులు ఉన్నారు.



కోట్‌పల్లి: ప్రచారం చేస్తున్న నాయకులు

రోహిత్‌రెడ్డి స్థానికుడు

తాండూరు రూరల్: స్థానికుడైన ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డిని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని అంతారం ఎంపీటీసీ శాంతుకుమార్ అన్నారు. గురువారం మండలంలోని అంతారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా శాంతు మాట్లాడుతూ.. రోహిత్‌రెడ్డితోనే తాండూరు అభివృద్ధి సాధ్యమన్నారు. మరోసారి గెలిపిస్తే తాండూరులో ఉన్న పెండింగ్ పనులు పూర్తి అవుతాయని అన్నారు. కార్యక్రమంలో ఎంసీ డైరెక్టర్ ప్రకాశ్, బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.



తాండూరు రూరల్: ప్రచారం చేస్తున్న ఎంపీటీసీ శాంతు, తదితరులు

రోహిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

బంట్వారం: తాండూరు బీఆర్‌ఎస్ అభ్యర్థి పైలెట్ రోహిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిలపించాలని కోట్‌పల్లి బీఆర్‌ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కోట్‌పల్లి మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేశారు. రోహిత్‌రెడ్డిని మరోసారి ఆదరించి గెలిపించాలని అభ్యర్థించారు. మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుందని, కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. తాండూరు నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న రోహిత్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

ఘనంగా సత్యసాయి జయంతి

కొడంగల్ : పుట్టపర్తి సత్యసాయి పుట్టిన రోజు వేడుకలను గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్, ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్ వాణీయాదవ్ దంపతుల నివాసంలో సాయిబాబా చిత్రపటానికి పూజలు చేశారు. శాప్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, ఎంఐఎం తాలూకా అధ్యక్షుడు గౌసన్ తదితరులు పాల్గొని పూజలు చేశారు. పట్టణంలో సాయిబాబా భజన మండలి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

శోభాయమానంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో భారీగా పాల్గొన్న భక్తులు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ సత్యాహరిశ్చంద్ర

కుల్కచర్ల: మండలంలోని చెరువుముందలి తండా(కే) గ్రామ పంచాయతీలో గురువారం శ్రీ ఆంజనేయస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. భక్తులు భారీగా విచ్చేసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కుల్కచర్ల ఎంపీపీ సత్యాహరిశ్చంద్ర, ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సోదరులు అనిల్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బాలునాయక్, చందు తదితరులు పాల్గొన్నారు.